చలో బస్‌భవన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు, ఉద్యోగులు

ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర

- అద్దె బస్సులతో అధోగతి
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే
- కార్మికులను అణచివేసే చర్యలు మానుకోవాలి
- 'చలో బస్‌భవన్'లో ఆర్టీసీ జేఏసీ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు అద్దె బస్సుల పేరుతో ప్రభుత్వం, యాజమాన్యం కుట్ర చేస్తున్నదని ఆర్టీసీ జేఏసీ నేతలు విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని చెప్పి మరిచిపోయిందని తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ ట్యాక్స్‌ల భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో ఆర్టీసీ డ్రైవర్ల సంఖ్యను పెంచితే తెలంగాణలో మాత్రం కుదిస్తున్నారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం 44 చట్టాలను తీసేసి 4 కోడ్‌లుగా విభజించడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీలో 12 నుంచి 16 గంటల పాటు డ్యూటీ చేయిస్తూ యాజమాన్యం కార్మిక శ్రమశక్తిని దోచుకుంటున్నదని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొని ఆర్టీసీకి సరఫరా చేయాలని కన్వీనర్ మౌలానా పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్, మెకానికల్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కో-కన్వీనర్ కత్తుల యాదయ్య కోరారు. మహాలక్ష్మి పథకంలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ బదులు స్మార్ట్ కార్డు ఇవ్వాలని సుద్దాల సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కమలాకర్‌రెడ్డి, బీ యాదగిరి, వివిధ జిల్లాల ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

తాగినడిపితే లైసెన్స్ రద్దే..

- అతివేగంగా, అధిక లోడ్‌తో వెళ్తే లైసెన్స్ క్యాన్సిల్
- నిబంధనలు మరింత కట్టుదిట్టం
- డేటాబేస్ ఆధునీకరణకు రవాణా, పోలీస్ శాఖల చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): మద్యం తాగి వాహనం నడిపితే వాహనదారుడిపై కేసు నమోదుతో పాటు లైసెన్స్ రద్దు కానున్నది. అధిక వేగం, బరువుతో గూడ్స్ వెహికల్స్ నడిపినా లైసెన్స్ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు. ఏడాదిలో రాష్ట్రంలో 15,209 లైసెన్సులను రవాణాశాఖ సస్పెండ్ చేసింది. ఇందులో ఎక్కువగా డ్రంక్ అండ్ డైవ్ కేసులే ఉన్నట్టు తెలిపారు. ఒకే వ్యక్తి మూడు సార్లు మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుపడితే లైసెన్సును సస్పెండ్ చేసేందుకు పోలీసులు రవాణాశాఖకు సిఫార్సు చేయనున్నారు. రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు. లైసెన్స్ విధానాన్ని కట్టుదిట్టం చేసేందుకు రవాణా, పోలీస్ శాఖలు డేటాబేస్‌ను ఆధునికరించాలని యోచిస్తున్నాయి. పట్టుబడిన వ్యక్తి ఫోటో లేదా ఆధార్ నంబర్ డేటాబేస్‌తో కనెక్ట్ చేయడంతో లైసెన్సు నంబర్, ఎక్కడ తీసుకున్నది క్షణాల్లో అధికారులకు తెలిసిపోనున్నది. దీంతో రవాణాశాఖ సులభంగా లైసెన్స్ సస్పెన్షన్ చేపట్టనున్నారు.

ఎమ్మెల్యే ఆర్డర్..అనుమతులున్నా బుల్డోజర్

- విమర్శలకు తావిస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారుల తీరు
- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు.. పనుల అడ్డగింత
- అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో బిల్డర్ వేధింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): అధికార పార్టీ ఎమ్మెల్యే అండతో చెలరేగుతున్న ఓ అక్రమార్కుడితో చేయి కలిపి శేరిలింగంపల్లి జోన్ అధికారులు ప్రవర్తిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. కష్టార్జితంతో ఇల్లు కట్టుకునేందుకు అన్ని అనుమతులు పొందిన ఓ యజమానిని వివాదస్పద బిల్డర్ కోసం వేధించడం చర్చనీయాంశమవుతున్నది. గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలాన్ని వీ దేవరాజ్, వీ కల్యాణి పేరుతో 2022 సంవత్సరంలో జీహెచ్‌ఎంసీకి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారు. అంతా పరిశీలించాక టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఇటీవల దేవరాజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇదే కాలనీ హౌజింగ్ సొసైటీపై పెత్తనం చలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్‌రావు కన్ను ఈ స్థలంపై పడింది. అక్కడి నుంచి పనులను అడ్డుకోవడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో దేవరాజ్ గత నెల 27న శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ సీనియర్ ఎమ్మెల్యే(అధికారపార్టీ) అండతో శ్రీధర్‌రావు చెలరేగిపోయాడు. ఆయన ఆదేశాలతో అధికారులు దేవరాజ్ నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇందేంటని ప్రశ్నిస్తే తమకు ఫిర్యాదు అందిందని అనుమతినిచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు. ఈ క్రమంలో దేవరాజ్‌పై తరచూ వేధింపులు ఎక్కువయ్యాయి. అన్ని అనుమతులతో నిబంధనలకు అనుగుణంగా పనులు మొదలుపెడితే కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మాణ పనులు అడ్డుకుని, ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

ద్రోహి సమాచారంతోనే ఎన్‌కౌంటర్

- విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు
- కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు బాధ్యత వహించాలి
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్
- 9న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

ములుగు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఈ నెల 1న ములుగు జిల్లా చెల్పాక వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు ఏడుగురు మావోయిస్టులకు విషమిచ్చి చంపారని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 30న ఏడుగురితో ఉన్న దళం చెల్పాక పంచాయతీలోని వలస ఆదివాసీ గ్రామంలో నమ్మిన వ్యక్తికి భోజనాలు ఏర్పాటు చేయమని కోరారని తెలిపారు. అప్రూవర్‌గా మారిన ఇన్ఫార్మర్ ద్వారా భోజనంలో విషం కలిపి స్పృహ కోల్పోయేలా చేశారని చెప్పారు. చిత్రహింసలు పెట్టి తెల్లవారుజామున 4 గంటలకు కాల్చి చంపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హత్యాకాండను నిరసిస్తూ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్టు వెల్లడించారు. ప్రజాస్వామికవాదులు, విద్యాలయాలు, వ్యాపారసంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వం, బాధ్యత వహించి, న్యాయ విచారణ జరిపి పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మాజీ సర్పంచ్‌ల హత్య

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 5 : మావోయిస్టులు ఇద్దరు మాజీ సర్పంచ్‌లను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గురువారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు సుఖ్‌రామ్ ఆవ్‌లం, సుక్లు ఫర్సాను మావోయిస్టులు మంగళవారం అర్ధరాత్రి అపహరించుకెళ్లారు. పార్టీకి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నారనే నెపంతో వారిని హత్య చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటన బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

'మెగాఫుడ్ పార్క్' సభ వెలవెల

- పాగడ్తలకే పరిమితమైన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల ప్రసంగం
- విసుగెత్తిన ప్రజలు.. సభ మధ్యలో నుంచి వెళ్లిపోయిన వైనం

పెనుబల్లి (సత్తుపల్లి), డిసెంబర్ 5 : ఖమ్మం జిల్లా బుగ్గపాడులో గురువారం జరిగిన మెగా ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒకరినొకరు పొగుడుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీంతో విసుగెత్తిన ప్రజలు సభ నుం లేచిపోవడంతో ఖాళీ కుర్చీలే మంత్రుల ప్రసంగాన్ని వినాల్సి వచ్చింది. ముఖ్యఅతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరుకాగా.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. మంత్రులు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకోవడంతో ప్రజలు వెళ్లిపోయారు.

సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మధ్యలోనే వెళ్లిపోతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు

హోంగార్డులకు నో 'రైజింగ్'

- ఏటా జరిగే కార్యక్రమాలకు సైతం మంగళం
- అడ్రస్‌లేని కవాతు, స్పోర్ట్స్‌మీట్, ప్రశంసాపత్రాలు
- అమరజవాన్ల త్యాగాలను అవమానించినట్టే
- నేడు హోంగార్డుల 75వ రైజింగ్‌డే

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఓ వైపు రాష్ట్రంలో 'తెలంగాణ రైజింగ్' పేరిట వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ 75వ రైజింగ్‌డేను గాలికి వదిలేసిందని హోంగార్డులు వాపోతున్నారు. దేశంలో హోంగార్డుల వ్యవస్థ ప్రారంభమై 75 ఏండ్లు పూర్తికావొస్తున్న సందర్భంగా.. డిసెంబర్ 6న ఎంతో ఘనంగా నిర్వహించాల్సిన స్వర్ణోత్సవాలను ప్రభుత్వం, పోలీసుశాఖ గాలికి వదిలేసినట్టు తెలుస్తున్నది. ఒక్క రక్తదానం మినహా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు రాష్ట్ర హోంశాఖ సిద్ధంగా లేదని రాష్ట్రంలో హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోంగార్డుల రైజింగ్‌డే రోజున ప్రతియేటా కవాతు, స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహించి తమను ప్రోత్సహించేవారని, ఆయా విభాగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారికి రివార్డులు, ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు ఇచ్చేవారని, ఆరోజు తమకు భోజన ఏర్పాట్లు కూడా చేసేవారని చెప్తున్నారు. తాము ఎంతగానో నమ్మకం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఇలా గాలికి వదిలేయడం ఆవేదనకు గురిచేస్తున్నదని అంటున్నారు. ఇది విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు చేసిన వారిని అవమానించడమేనని అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేసి, అన్ని జిల్లాల్లో ఘనంగా హోంగార్డుల రైజింగ్‌డేను నిర్వహించాలని వారు కోరుతున్నారు.

హోంగార్డుల సమస్యలపై పట్టింపేది?

'అటెండర్‌కు ఎక్కువగా.. పోలీసుకు తక్కువగా' డ్యూటీలు చేస్తున్న తమ సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా పెండింగ్‌లో ఉన్న యూనిఫాం అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఆర్డర్లీ వ్యవస్థను తొలగించాలని, 600కు పైగా ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు. అలాగే హోంగార్డుల సాధారణ మరణానికి రూ.5 లక్షల నగదు ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చినట్టు ఇవ్వాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక భరోసా కల్పించాలని, ఆరోగ్య భద్రత తమకు కూడా వర్తింపచేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ అవినాశ్

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

కన్నాయిగూడెం, డిసెంబర్ 5 : మండలంలోని ఫర్టిలైజర్ షాపులను ఏడీఏ అవినాశ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల స్టాకు రిజిష్టర్లను పరిశీలించి నాణ్యమైన మందులు అమ్మాలని యజమానులకు సూచించారు. అనంతరం రైతు వేదికలో ఏడీఏ రైతులతో కలిసి ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కల్యాణి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

కృష్ణకాలనీ, డిసెంబర్ 5 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో 14న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నారాయణబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ద్వేష భావాలను తగ్గించుకొని రాజీమార్గాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పోలీస్ స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమ్మెకు సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఏటూరునాగారం, డిసెంబర్ 5 : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈనెల 6,7తేదీల్లో నిర్వహించే సమ్మె నోటీసులను ఎంఈవో మల్లయ్యకు గురువారం అందించారు. రాష్ట్రసమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుల పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్రం, కేజీబీవీ ఉద్యోగులు శ్రీధర్ నాయక్, వెంకటేశ్వర్లు, తిరుపతి, చందర్ పాల్గొన్నారు.

కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి

మహదేవపూర్, డిసెంబర్ 5 : మండలంలో కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఎఫ్ఆర్వో రవికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయని, దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. నివారణకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఫ్ఆర్వోను కోరారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్, నాయకులు ధర్మయ్య, రవితేజ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించుకొని తీరుతాం

మల్హార్, డిసెంబర్ 5 : ఎస్సీ వర్గీకరణ సాధించుకొని తీరుతామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేశ్ తెలిపారు. గురువారం తాడిచెర్లలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులపై సమావేశం నిర్వహించారు. వర్గీకరణ జరిగితేనే ఎస్సీల్లో ఉన్న అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాండ్ర మల్లేశ్, నాయకులు కేసారపు చంద్రయ్య, పులిగంటి నర్సయ్య, తాండ్ర దినేశ్, ఇందారపు అరుణ్, తుంగపల్లి సాత్విక్, సందీప్, అరుణ్, చరణ్, సుదర్శన్, గణేశ్ పాల్గొన్నారు.

పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడాలి

టేకుమట్ల, డిసెంబర్ 5 : పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలని వెంకట్రావుపల్లి వెటర్నరీ డాక్టర్ వివేక్ అన్నారు. మండలంలోని దుబ్యాలలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. పశువులు వ్యాధుల బారిన పడకుడా సకాలంలో నట్టల మందు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్స చేశారు. కార్యక్రమంలో మండల పశు ఆరోగ్య ఉపకేంద్రం సహాయకులు దాసరి శంకర్, జిల్లా పశు సంపద అభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, గోపాల మిత్రులు రాజేందర్, కుమార్, పశుమిత్రలు అనిత, సర్వోత్తమ్ రావు, సామి రావు, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజం

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, డిసెంబర్ 5 : క్రీడలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని తంగేడు మైదానంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగం గా జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు క్రీడా పోటీలు ని ర్వహించారు. కలెక్టర్ దివాకర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌తోకలిసి క్రికెట్ టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. కలెక్టర్ క్రీ డాకారులతో కలిసి క్రికెట్ ఆడి అలరించారు. సీఎం కప్ పోటీలు గ్రామపంచాయతీల పరిధిలో 7,8 తేదీల్లో, మండల పరిధిలో 10, 11,12, జిల్లా పరిధిలో 16నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కలెక్టర్ బండారుపల్లి మోడల్‌పాఠశాలలో కబ డ్డీ, ఏటూరునాగారంలో హ్యాండ్‌బాల్, ములుగులో క్రికెట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమం లో జిల్లా క్రీడల ఇన్‌చార్జి అధికారి తుల రవి, క్రికెట్ కోచ్ పైడిమల్ల సందీప్, కబడ్డీ కోచ్ పీ జనార్దన్, హ్యాండ్‌బాల్ కోచ్ కుమారస్వామి, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టాస్ వేస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడమేనా ప్రజా పాలన

కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి

కృష్ణకాలనీ, డిసెంబర్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వాళ్లను అరెస్ట్ చేసి గొంతు నొక్కడమే ప్రజా పాలనా? అని కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకొని, అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. ఉద్యమకారులకు కేసులు కొత్తేమీ కాదని, కాంగ్రెస్ కుతంత్రపు రాజకీయాలకు భయపడేదిలేదన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను పాల్పడుతున్నదన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసింది కేవలం బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం, జైలుకు పంపించడమే వారు సాధించిన విజయమన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు కక్ష్య సాధింపు రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. మాజీ మంత్రి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భూ తగాదాలో మేనల్లుడిపై గొడ్డలితో దాడి

- తలపై తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం
- వరంగల్ ఎంజీఎంకు తరలింపు

దాడిలో గాయపడిన సుంకె మహేశ్

మహదేవపూర్, డిసెంబర్ 5 : భూ తగాదాలతో మేనల్లుడిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన మండలకేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై పవన్ కుమార్, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకె మహేశ్‌కు జంగేడుకు చెందిన తన మేనమామ తుంగ రాజయ్యతో కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాజయ్య తన భార్య, కొడుకుతో కలిసి సుంకె మహేశ్ ఇంటికి వచ్చి భూమి విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో రాజయ్య గొడ్డలితో మహేశ్ తలపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుడిని కుటుంబ సభ్యులు మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. మహేశ్ తల్లి ఈశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రైతుతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కుమారస్వామి

పశు గణన సర్వే పరిశీలన

గణపురం, డిసెంబర్ 5: మండలంలోని చెల్పూర్ పశు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన పశు గణన సర్వేను గురువారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పశు గణన సర్వేతో డేటా తయారు చేస్తామన్నారు. ఈ సర్వేతో ఎన్ని పశువులు ఉన్నాయో స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. దీని ద్వారానే పశువులకు వ్యాక్సిన్లు, మందులు వస్తాయని తెలిపారు. ప్రతి రైతు పశువుల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిచంద్రారెడ్డి, కారోబార్ వేణు, గోపాలమిత్ర రాజేంద్రాచారి పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల నిర్వహణపై సమీక్ష

మహదేవపూర్, డిసెంబర్ 5 : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై కార్యదర్శులు, పీఈటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, యోగా, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 7,8 తేదీల్లో గ్రామ స్థాయిలో, 10 నుంచి 12 తేదీ వరకు మండల స్థాయి పోటీలు నిర్వహించన్నట్లు తెలిపారు. మండలస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రకాశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు అంజలిరెడ్డి, దామోదర్‌రెడ్డి, సృజన్, సమ్మయ్య, సతీశ్, కల్పన పాల్గొన్నారు.

దామెరకుంట ప్లాంటేషన్ పరిశీలన

కాటారం, డిసెంబర్ 5 : మండలంలోని దామెరకుంట అటవీ ప్లాంటేషన్‌ను జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాటారం రేంజ్ అటవీ అధికారి స్వాతి, డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్, బీట్ అధికారులు రాజ్‌కుమార్, జయలక్ష్మి పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన నెదర్లాండ్ దేశస్తురాలు

వెంకటాపూర్, డిసెంబర్ 5 : రామప్ప దేవాలయాన్ని గురువారం నెదర్లాండ్ దేశస్తురాలు ఎస్‌జే స్లాట్స్ సందర్శించారు. ఆలయ విశిష్టత, చరిత్రను స్టేట్ టూరిజం గైడ్ జొన్నగడ్డ సాయినాథ్ ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామప్ప శిల్పకళ బ్యూటీ ఫుల్‌గా ఉందని కొనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.

కార్మికులు ఉత్పత్తికి కృషి చేయాలి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 5 : కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలని కేటీకే- 1 గ్రూప్ ఏజెంట్ జే వెంకటరమణ అన్నారు. బుధవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇంక్లైన్ గనిపై మొదటి షిఫ్ట్ ప్రారంభ సమయంలో ఆర్‌జీ-2 ఏరియాలోని జీడీకే-7 ఎల్ఈపీ గనిలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హెడ్ ఓర్‌మెన్ టీ సత్యనారాయణ మృతికి ఉద్యోగులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కార్మికులు ఎనిమిది గంటల పని విధానానికి కృషి చేయాలని, యంత్రాల పని గంటలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో యాక్టింగ్ మేనేజర్ ఎం జాన్సన్, వీవో రమేశ్, డబ్ల్యూవో సందీప్‌కుమార్, పిట్ సె